# పింఛను!

పాపాయమ్మకి తన వయసెంతో తెలీదు. ఎప్పుడు పుట్టిందో కూడా గుర్తులేదు. ముగ్గుబుట్ట లాంటి తల్లో వెంట్రుకలు... పళ్లూడి లోపలికి తోసుకుపోయిన సొట్టబుగ్గలు... బ్రహ్మ రాసిన రాతల్లాగ నుదుటిన నాలుగైదు ముడతల తాలూకు గీతలు... ఒడిలిన శరీరం... గుంటకళ్లు... వణికే స్వరం... చూచి ఎవరికైనా పాపాయమ్మకు రమారమి ఎనభై దాటి నట్టనిపిస్తుంది.

పాపాయమ్మకు ఇద్దరు పిల్లలు. రజ స్వలైన కూతురి మెడలో... గంతకు తగిన బొంతలాగ కట్టెలు అమ్ముకు జీవించే కోటిగాడికిచ్చి కూతిరి మెడలో తాళి కట్టించి కాపురానికి పంపింది. నాలుగైదేళ్ల గడిచాక గ్రామం చుట్టూ వున్న చిన్న సైజు అడవులు అంతరించి పోవడంతో రోజులు గడవడం కష్టమనిపించిన కోటిగాడు పెళ్లాన్ని వెంటేసుకుని ఎక్కడైనా పని దొరికితే పొట్టపోసుకుందామని గ్రామం వదిలి ఎటో వెళ్లాడు.

కూతురు అల్లుడు గురించిన సమాచారమే లేకుండా పోవటంతో... వాళ్లెక్కడున్నా... సుఖంగా...వుంటే చాలనుకుంది పాపాయమ్మ.

ఆ తర్వాత ఏడాదికే పాపాయమ్మ మొగుడు యాదయ్య కూలిపనిచేస్తుండగా... ఒక రోజు కడుతున్న ఇంటి మూడవ అంతస్తుపై నుంచి పడి అకస్మాత్తుగా చనిపోవటంతో లబోదిబో మంది పాపాయమ్మ.

అప్పటి నుండి పాపాయమ్మ బతుకు దుర్భరమైంది. ఆకతాయిగా తిరిగే కొడుకు డబ్బులకోసం నిత్యం వేధించే వాడు. వయసు మీద పడిన కొడుక్కి సంపాదన మీదికి గాలి మళ్లక పోవడంతో బాధపడని రోజంటూ లేదు.

తాగొచ్చి తల్లిని జుట్టు పట్టుకు తన్నినా నవమాసాలు మోసి కన్న నేరానికి కొడుకుని ఏమీ అనలేకపోయేది.

అడిగినప్పుడల్లా చిల్లరిస్తూ... రెండు పూటలా కూడు పడేస్తూ వచ్చింది! తనకా వయసు మీద పడుతున్నా రెక్కల కష్టం తప్పటం లేదు.

పెళ్లి చేస్తేనైనా కొడుకు బాగుపడతాడేమోనని ఆలోచించింది. జులాయిగా తిరిగే వెధవకి పిల్ల నెవరిస్తారన్పించింది.

ఒక రోజు పోలీసులొచ్చి అర్ధరాత్రి సమయంలో కొడుకుని స్టేషన్‌కి బలవంతాన లాక్కెళ్లటం చూచి వలవలా ఏడ్చింది. తనూ రోదిస్తూ కొడుకు వెంటే స్టేషన్‌కెళ్లింది.

తన కళ్లముందే కొడుకుని లాకప్‌లో వేసి లాఠీలతో కుళ్లబొడవటం చూచి తల్లి హృదయం విలవిల్లాడింది. కొట్టొద్దంటూ ఎస్సై కాళ్లా వేళ్లా పడింది. తన కొడుక్కి ఏ పాపం తేలీదని.. విడిచి పెట్టమనీ ఏడ్చింది. కనికరించమని వేడుకుంది.

ఎస్సై మనసు కరగకపోగా... పాపాయమ్మ గుండెలమీద బూటుతో నిర్ధాక్షిణ్యంగా తన్నాడు. అమెను బండ బూతులు తిట్టాడు. చివరికి స్టేషన్‌ల్లోంచి బైటికీడ్చాడు.

చేసేది లేక.... నిస్సహాయురాలైన పాపాయమ్మ... వంటరిదైంది. కాళ్లీడ్చుకుంటూ వెక్కి వెక్కి ఏడుస్తూ గుడిసె చేరుకుంది. ఇరుగు పొరుగు వాళ్లకి చెప్పినా ఎవ్వరూ పట్టించుకుని సాయపడ్లేదు.

పోలీసోళ్లు కొడుకుని ఏంచేస్తారనే దిగులు పాపాయమ్మని పీక్కుతింటోంది. కాపాడమంటూ దేవుళ్లకు మొక్కింది.

వారం రోజులు గడిచాక... కోటిగాడు ఊరవతల దుబ్బుల్లో చచ్చిపడున్నాడని తెల్సిన పాపాయమ్మ... వురుకులు పరుగులతో అక్కడికి చేరింది.

కొడుకు నెత్తుటి మడుగులో చచ్చిపడి వుండటం చూచి భోరుమని విలపించింది. చుట్టూ మూగిన వారెవ్వరూ వోదార్చక పోగా కోటిగాడిని పోలీసోళ్లే కాల్చి చంపేసి వుంటారనే విషయాన్ని మాట్లాడు కోవడం విన్న పాపాయమ్మ ఏడ్చి ఏడ్చి కొడుకు శవం మీదే సొమ్మసిల్లి పడిపోయింది.

★★★★★

మొగుడు పోయె... చెట్టంత కొడుకు దక్కకుండా పోయె...కూతురు.. అల్లుడి జాడ తెలియలేదాయె.

పాపాయమ్మ వంట్లో శక్తి క్షీణించింది. పనిచేసి పొట్టపోసుకోగల సత్తా లేకుండా పోయింది.

ముద్దకోసం ఇల్లిల్లూ తిరిగి అడుక్కో సాగింది. అదీ దొరకని రోజు పస్తులుంది.

ఒక రోజు గ్రామ పంచాయితీ ఆఫీసు దగ్గర్లో వున్న చెట్టునీడన పాపాయమ్మ సొమ్మసిల్లి పడి వుండటం ప్రాథమిక పాఠశాల పంతులు శౌరయ్య చూశాడు. అయ్యో పాపం అనుకుని పక్కనే వున్న టీ కొట్లోంచి గ్లాసుతో నీళ్లు తెచ్చి ముఖాన చల్లాడు. తెలివి వచ్చాక పాపాయమ్మకి బన్‌రొట్టె కొనిచ్చి తినమని టీనీళ్లు పోయించి పుణ్యం కట్టుకున్న శౌరయ్య పంతులు.. ఆమె బతుక్కోనం పాఠశాల వద్ద వున్న నేరేడు చెట్టు నీడన. బఠాణీలు...శనగపప్పు వుండలు...చేగోడీలు... వేరుశనక్కాయలు అమ్ముకుని జీవనయానం సాగించేటందుక మంచి మనసుతో సాయపడ్డాడు.

పాపాయమ్మకి ఎలాగైనా వితంతు ఫించను మంజూరయ్యేలా ప్రయత్నించాలనే ఆలోచన

శౌరయ్య మదిలో మెదలింది.

తానే దరఖాస్తు ఫారం నింపి పాపాయమ్మతో వేలిముద్ర వేయించి.. తనకు తానుగా సాక్షిసంతకం చేసి పంచాయితీ ఆఫీసుకెళ్లి సర్పంచ్ సోమిరెడ్డిని స్వయంగా కలిసి పాపాయమ్మ దీన గాథ విన్పించి... ఎలాగైనా ఆమెకు పింఛనొచ్చేట్టుగా రికమెండ్ చేయమంటూ కోరాడు శౌరయ్య పంతులు.

'దారిన పోయేవన్నీ నెత్తికి రాసుకుంటావేంది పంతులూ?..' సర్పంచ్ మాటల్లో హేళన కనిపించింది.

పరిహసించినా బాధపడని శౌరయ్య'సర్పంచ్‌గారూ పాపం! పాపాయ్యమ్మ బీదముండ పైగా అనాథ. ఇలాంటి వారిపై మీరు దయ చూపకపోతే ఎట్లా?' - వినయంగా మాట్లాడాడు.

సర్పంచ్ కస్సుమంటూ... పాములా బుసకొట్చి 'నీకేం పనీ పాటా లేదా ఏంది?.. ప్రజా సేవకి నేనున్నాను కదా!?... నువ్వు దేనికయ్యా. అయిన దానికి కాని దానికి గోచీ బిగిస్తావ్?- నీపని మానుకుని ఈడకు రాపనిలే!. సూత్తాలే ఎల్లు' నిర్లక్ష్యాన్ని ప్రదర్శించాడు సోమిరెడ్డి.

శౌరయ్య మేష్టారికి సోషల్‌సర్వీసు చేయుట మంటే ఎంతో ప్రీతి! ఎదుటి వారి కష్టాలను చూడలేడు.

'ఇంకా ఏంది నాకాడే నిలబడినావ్? గాంధీవై పోదామనుకుంటుండావా ఏందీ?... పిల్లోళ్లకి శ్రద్ధగా పాఠాలు చెప్పు చాలు?.. 'అంటూ ఏవగింపుగా శౌరయ్య ముఖంలోకి తీక్షణంగా చూసాడు.

శౌరయ్య ఆత్మాభిమానం దెబ్బతిన్నా బాధన్పించలేదు. సర్పంచ్ స్వభావం..గుణం ఆయనకు తెలియనివి కావు.

సర్పంచ్ రావాణాసురుడు! మంది సొమ్ము మెక్కటంలో దిట్ట అనే నిజం శౌరయ్య ఎరుగు!

తాను నమ్మిన ఆదర్శాలకు కట్టుబడేవాడు కావటానికి సర్పంచ్‌ని పాపాయమ్మకి ఫింఛను మంజూరు విషయంలో ఒకటికి నాలుగు సార్లు దేబిరించాడు.

సర్పంచ్ సోమిరెడ్డితో తలపడి 'ఢీ' కొట్టగల సత్తా తనకు లేదు. అందుకే తనలో కోపం రగల్లేదు.

ఒక్క సోమిరెడ్డి కాదు.. గ్రామంలో పెద్ద మనుషులుగా చెలామణి అవుతున్న వారందరి జాతకాలూ శౌరయ్య పంతులుకి తెలీనవి కావు. వారి దుష్టబుద్ధులు.. దుర్మార్గపు ఆలోచనలు అన్నీ ఎరిగినవాడే శౌరయ్య.

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దటం కోసమే తాను టీచరయ్యాడు. ముఖ్యంగా గ్రామాల్లో అమాయక నిరక్షరాస్యులకు సాయపడాలనే సిటీ వదిలి పల్లెటూరు కావాలని కోరుకున్నాడు.

తానొచ్చాక స్కూల్లో విద్యార్థుల సంఖ్య పెరిగింది. పిల్లలకు నాలుగు అక్షరం ముక్కలు అబ్బినయ్.

గ్రామంలో రెండు వందల మంది వితంతువులకు నెలనెలా ఫించను శాంక్షనౌతుండటం తనకు తెలుసు.

ఆ రెండువందల్లో అసలు లబ్ధిదారులు యాభై మందికూడా వుండరనే నిజమూ ఎరిగినవాడు శౌరయ్య. మిగతా వారంతా బినామీ పేర్లతో సంతకాలు అయినవారిచేత పెట్టించి డబ్బు నొక్కేస్తున్నాడు. ప్రభుత్వం ఇచ్చే నిధులను మెక్కేస్తున్నాడు. శౌరయ్య మేష్టారికి అన్నీ తెలుసు. అయినా వాటి జోలి తనకు అక్కర్లేదు. ఎవరి పాపం పండితే వారే పట్టుబడతారు అనుకునే స్వభావం కావటంతో తనకు తెలీనట్టు... తనకేమీ పట్టనట్టే వుంటాడు.

ఆసలైన బాధిత వితంతువులకు పింఛను అందకపోవటం కళ్లారా చూస్తూ... బాధపడు తున్నాడే తప్ప...నోరెత్తలేకపోతున్నాడు.

కనీసం...పాపాయమ్మ లాంటి నిర్భాగ్యురాలికైనా సాయం అందితే బావుండేదని తాపత్రయపడుతూ తన వంతు ప్రయత్నం తాను చేస్తున్నాడు శౌరయ్య పంతులు.

రోజులు గడుస్తున్నాయ్. తానిచ్చిన పింఛను దరఖాస్తులను పైకి పంపకుండా సర్పంచ్ బుట్ట దాఖలు చేస్తున్న విషయమూ గ్రహించగలిగాడు.

గ్రామంలో జరుగుతున్న రాజకీయాలను, దుర్మార్గాలనూ చూస్తూ సహించలేక... ప్రత్యక్షంగా తానేమీ చేయలేక... సిటీకెళ్లినప్పుడు అక్రమాల గురించి పత్రికల వారికి ఉప్పు అందించాడు. శౌరయ్య! జరిగే అన్యాయాలు అక్రమాలు గురించి దినపత్రికలన్నీ తూర్పార పట్టినయ్.

సర్పంచ్ సోమిరెడ్డి గుండె భగ్గుమంది. విషయాలను పత్రికల కెక్కించగల వ్యక్తి శౌరయ్య పంతులొక్కడే అనే నిర్ణయానికొచ్చాడు.

బుస కొట్టకుండా కాటేయాలనుకున్న సర్పంచ్... వారం తిరక్క ముందే... శౌరయ్యకి గ్రామం నుంచి మరో దూరప్రాంతానికి బదిలీ చేయించాడు. తన సత్తా చాటుకున్నాడు.

పెట్టే బేడ సర్దుకుని శౌరయ్య పంతులు ఊరు విడిచి వెళ్లబోతూ... ఆగి పాఠశాల బోర్డుకి నమస్కరించాడు. రెండడుగులు ముందుకేసి... వెళ్లిపోయే ముందు పాపాయమ్మ స్థితికి జాలిపడి కాస్తంత డబ్బు సాయం చేయాలన్పించటంతో ... కళ్లుమూసుకుని చెట్టుకి జారగిలబడి వుండటం గమనించి 'పగలే' నిద్ర పోతోంది పిచ్చిది' అనుకుంటూ పాపాయమ్మకు

దగ్గరై చేతితో ఆమెను నిద్ర లేపాలనే ప్రయత్నంలో కుదిపాడు.

శౌరయ్య పంతులు కుదపటంతో పాపాయమ్మ పార్ధివ శరీరం పక్కకు ఒరిగి నేలవాలింది. మేష్టారు ఒక్కక్షణం నిశ్చేష్ఠుడయ్యాడు. నోట మాట కూడా కరువైంది.

పాపాయమ్మ ముక్కు కింద వేలు పెట్టి చూసాడు. ఆమె చనిపోయి వుంటుందని తెలుసు కున్నాడు. శౌరయ్య పంతులు మనసు చివుక్కు మంది! బ్రతికి వుండగా అమెకి వితంతు ఫింఛను ఇప్పించాలనే ప్రయత్నం ఫలించకుండా పోయింది. ఇప్పుడు పాపాయమ్మే పంచభూతాల్లో కలిసి పోయింది. వెళ్లబోయేవాడల్లా ఆగిన శౌరయ్య.. పాపాయమ్మ శవాన్ని కాటికి చేర్పించి... ఆమె అనాధ కాదని. తనే అన్నీ అయి అంత్యక్రియలు జరిపాడు. చమర్చిన కళ్లను పై కండువాతో అద్దుకున్నాడు.

పాపాయమ్మ వంటి నిర్భాగ్యులెందరో ఈ దేశంలో... ఎవరి ఆదరణకీ నోచుకోలేదు... కనీసం ఫింఛనైనా వచ్చి వుంటే మరికొన్నాళ్లు బతికి వుండేదేమో అన్పించింది శౌరయ్య మేష్టారికి!

పింఛను పొందలేక అల్లాడిపోతున్న పాపాయమ్మ వంటి నిర్భాగ్యులెందరో...??

-:(సమాప్తం):-

*(మార్చి 2009 చిత్ర మంత్లీ)*